# సమస్యా! నీకు సమాధి తప్పదు

జి. నరసింహమూర్తి



అనుకోకుండా అమాంతంగా అలా వచ్చేసిన రాఘవరావుని చూసి ఆశ్చర్యపోయింది కమల.

తరుగుతున్న కూరగాయల్ని అలాగే వదిలేసి లేచి నుంచుంది.

ఆమెలో కొంత భయం. కలవరం.

ఏం చెయ్యాలో తెలియని విషమ పరిస్థితి.

అతని కళ్ళద్దాల వెనక అవి కళ్ళులా లేవు కణకణమండే నిప్పుల్లా ఉన్నాయి. ముడతలు పడ్డ ముఖాన క్రోధం, అసహ్యం, ద్వేషం స్పష్టంగా గోచరిస్తున్నాయి.

"ఈ నాటకం ఎంత కాలం నుంచి?" ఆ ప్రశ్న పిడుగు పడ్డట్టే ఉంది.

కమల తన భయాన్నీ, కలవరాన్నీ పక్కకునెట్టేసి ధైర్యం కూడదీసుకోవడానికి ప్రయత్నిస్తూంది.

ఆ గొంతు విని లోన వంట పని చూస్తున్న శ్యామల గుమ్మం వరకూ వచ్చింది.

నాన్న. ఇంత కాలం నుంచీ తనను అసహ్యించుకుంటూ తనని చచ్చినట్టు జమ కట్టిన నాన్న. తనని చూసి వెళ్ళడాని కొచ్చిన (మరి) తల్లిని ఇప్పుడు బతక నీయడు. రహస్యంగా వస్తూ చూసి పోతున్న అతల్లిని హింసించక మానడు తన ప్రేమతో అభిమానంతో, సానుభూతితో పెంచి కొస్తున్న ఆ ఉత్తమురాలు జీవితంలో ఒక ప్రళయం చెలరేగక మానదు.

"ఏం? మాట్లాడవే?"

". . ."

"నువ్వింత కాలంగా నన్ను మోసగిస్తున్నావు. పుట్టింటికెళుతున్నావని చెప్పి ఈ లేచి పోయి వచ్చిన దాని ఇంట కొన్ని రోజులుండి ఏమీ ఎరగనట్టు తిరి గొస్తున్నావు. నీకు సిగ్గూ శరమూ లేదూ? నాకు కాని కూతురు నీ కెలా అయిందే?"

అతనిలో ఆమెను అక్కడే కొట్టాలని, కొట్టి బాగా బుద్ధి చెప్పాలనీ ఉంది. కాని అది తన కూతురు ఇంకో వ్యక్తితో లేచి వచ్చిన ఇల్లు అది తాను అసహ్యించుకుంటున్నకొంప. అక్కడికి తన జన్మలో ఎప్పుడూ అడుగు పెట్టకూడదని నిర్ణయించుకున్నాడు సంవత్సరం క్రితమే.

తండ్రిని అంత కాలం తరవాత మళ్ళీ చూసిన శ్యామలకు ప్రేమ పొంగు కొచ్చింది. పలకరించాలనీ అతని ఆశీస్సులు పొందాలనీ శ్యామల ఆరాట పడుతూంది.

తండ్రి కోపం చూస్తే తనకూడా భయంగా ఉంది.

అయినా "నాన్నా!" అంది పలకరింపుగా.

రాఘవరావు చూడకూడ దనుకుంటూనే అటు చూశాడు.

కూతురు నిండు గర్భిణి.

తల పక్కకు తిప్పుకున్నాడు.

తాను తాత కాబోతున్నా డన్నమాట. హు.

అతనికి ఆ వాతావరణం మరింత చీదరింపుగా తయారయింది.

'ఇంటి పరువు నాశనం చేసి లేచి వచ్చిన దాని బిడ్డకు నేను తాతనా?' అనుకున్నాడు.

'కాదు. ఎంత మాత్రమూ కాదు' అనుకుంటున్నాడు.

ఆ నాడు తన ఆఫీసులో ఉంటున్న నరసింహారావు తరచు తమ ఇంటి కొస్తుండే వాడు.

అతను శ్యామలను చూసి ప్రేమించాడు. ఆమె కూడా అతణ్ణి ప్రేమించింది.

ఇద్దరూ పెళ్ళాడ బోతున్నట్టుకూడా నరసింహారావు అందరికీ చెబుతూంటే 'ఈ సంగతి నిజమేనా? నిజంగా నువ్వు పెళ్ళాడ తావా?' అని రాఘవరావు అడిగాడు.

నరసింహారావు తలి దండ్రులు తన మాట కాదనరని నెలవు మీద రాఘవరావుని తన కుటుంబాన్ని ఇంటికి రమ్మన్నాడు.

పెళ్ళి ప్రయత్నాల మీదే రాఘవరావు తన స్వగ్రామం వెళ్ళాడు—తాను ఉద్యోగం చేస్తున్న ఉత్తర హిందూస్థాన్ నుంచి.

అక్కడ నరసింహారావు తలిదండ్రులతో సంప్రదించి శ్యామల పెళ్ళి నరసింహారావుతో చెయ్యాలని రాఘవరావు కోరిక.

తల్లి లేని పిల్ల. అంతకంటే మంచి సంబంధం దొరకదనే ఉద్దేశ్యం అతనిది. పైగా వెతక నవసరం లేకుండా దొరికిన అల్లుడు.

రాఘవరావు నరసింహారావు తలి దండ్రులతో సంప్రదించ డాని కెళ్ళాడు.

అక్కడ వ్యవహారం చిత్రంగా మారిపోయింది.

"మా అబ్బాయిని గుప్పెట్లో పెట్టుకుని మీ అమ్మాయిని కట్ట బెట్టడాని కొచ్చా రన్నమాట" అన్నాడు నరసింహారావు తండ్రి నాగభూషణం.

"మీ అబ్బాయి మా అమ్మాయిని ప్రేమించాడు. పెళ్ళి చేసుకుంటా నన్నాడు. ఎదిగిన కొడుకు మాట మీరు తప్పకుండా అంగీకరిస్తా రనే నమ్మకంతో నే నేంత దూరం నుంచి రావలసి వచ్చింది" అన్నాడు రాఘవరావు కాస్త నిబ్బరంగా.

"నా కొడుక్కి తమ కూతుళ్ళ నిస్తామని ఇలా చాలా మంది వచ్చారు కాని వచ్చిన వాళ్ళ కళ్ళా నా కొడుకును దానం చేసుకుంటా రనుకున్నారేంటి? హు బాగానే ఉంది. మీ కుటుంబం ఎక్కడ. మా కుటుంబం ఎక్కడ? పైగా ఆఅమ్మాయికి తల్లి లేదు.

సవతి తల్లి పెంపకం—రేపు కష్టమొచ్చినా, సుఖమొచ్చినా ఎవరు చూస్తారు?'' అన్నీ తెగేసినట్లు తన ఇష్ట ప్రకారం మాట్లాడుతున్నాడు.

''నాగభూషణంగారూ. . .'' అర్థింపుగా అన్నాడు రాఘవరావు.

''ఏటండీ? నా కొడుక్కి వేల మీద కట్నం ఇచ్చే గౌరవమైన సంబంధా లొస్తుంటేను?''

అయితే తమ సంబంధంలో గౌరవం లేదన్న మాట.

తాను వేల మీద కట్నం ఇచ్చుకునే స్థితిలో లేడు. వెనక ఏమీ ఆదాయం లేదు. తొలుతలో సంపాదించిన మొత్తం మొదటి భార్య జబ్బునడ్డప్పుడు హరించుకు పోయింది.

ఇక మిగులున్న దల్లా ఆ ఉద్యోగం. అదికూడా ఇంకో రెండు సంవత్సరాలు మాత్రమే. తరవాత రిటైర్ అయిపోతాడు. ఇటువంటి స్థితిలో తానేం చెయ్యగలడు?

ప్రావిడెంట్ ఫండ్ ఎడ్వాన్సుగా తీసుకుని పెద్ద కూతురికి పెళ్ళి చేశాడు.

''వాళ్ళిద్దరూ పెళ్ళాడదాని కిష్టపడ్డారు. పైగ మీ అబ్బాయి అన్నీ తెలిసిన వాడు. కనక అతని మాట మీద నే వింత దూరం వస్తే మీ రలా అంటూంటే ఇప్పుడేం చెయ్యను?'' అతనిలో బాధ ఎక్కువవుతూంది. తన ఆత్మగౌరవం చంపుకుని ప్రాధేయ పడవలసిన అగత్యం కలిగింది.

''ప్రతి ఆడదీ, ప్రతి మగాడూ పెళ్ళాడాలనే అనుకుంటారు. కాని వెనకాల వాళ్ళకి సాధక బాధకాలెం తెలుస్తాయి. పెళ్ళి చేయవలసిన తండ్రిని కాదని వాడంతట వాడే ఎక్కడో పిల్లను చూసుకొస్తే సరిపోయిందా? ఒరేయ్ అబ్బాయ్ నరసింహారావూ! నీకు నా ఆస్తి కావాలన్నా, ఈ ఇంట్లో చోటు కావాలన్నా నేను చెప్పినట్లు వింటావు. లేకపోతే నువు నా కొడుకువీ కావు నీకు నేను తండ్రినీ కాను'' అన్నాడు కర్కశంగా.

నరసింహారావు బిత్తర చూపులు చూస్తూ అక్కడే నిలబడి పోయాడు.

రాఘవరావు నరసింహారావు వేపు ఆశగా చూశాడు

'బాబూ! ఇప్పుడు నీ నిర్ణయం మీదా, నీ ధైర్యం మీదా నా బిడ్డ బతుకు ఆధార పడుంది' అన్నట్లు ఉన్నాయి ఆ చూపులు.

నరసింహారావు తల వంచుకుని లోన కెళ్ళబోతున్నాడు.

''ఆగు'' అన్నాడు నాగభూషణం.

నరసింహారావు ఆగిపోయాడు.

''అటో ఇటో తేల్చి చెప్పు'' అన్నాడు మళ్ళీ.

నిశ్శబ్దం — అందరి ముఖాల్లోనూ ఆత్రుత. అందరి కళ్ళూ అతని మీదే ఉన్నాయి.

''నాకీ పెళ్ళొద్దు'' అనేసి లోని కెళ్ళిపోయాడు, వ్యక్తిత్వం లేని నరసింహారావు.

రాఘవరావు మనసంతా కల్లోలం అయిపోయింది. ఇప్పుడేం చెయ్యాలి. నరసింహారావుకీ, తన కూతురికీ పెళ్ళని అక్కడ అందరికీ చెప్పి వచ్చాడు. కాని అది బెసికి పోయింది. వెళ్ళి అక్కడేం చెప్పాలి? తన పరువు పది మంది లోనూ ఏమవుతుంది?

ఆ బాధతో కూతురికి మరో సంబంధం కోసం వెదికాడు. కాని ఎక్కడా దొరకలేదు.

విసుగెత్తి పోయాడు. తన ఓర్పు చచ్చి పోతూంది. ఎక్కడి కెళ్ళినా 'మొదట్లో నరసింహారావు అనే అబ్బాయితో ప్రేమ కలాపాలాడిందిట కదూ?' అన్న మాటలే వినవస్తున్నాయి.

శ్యామలను తన తమ్ముడు దగ్గర వదిలి కమలతో తాను ఉద్యోగం చేస్తున్న చోటుకి తిరిగొచ్చాడు.

చాలా మంది చాలా చాలా విషయాలు అడిగారు. రాఘవరావుకి అవన్నీ చెప్పుకోవాలంటే అభిమానం.సిగ్గు. అందుకే మౌనంగా ఉండిపోయాడు కాని మొత్తంమీద నరసింహారావు ద్వారా కొంత రహస్యం బయటకు రాగారు.

అవన్నీ వింటూంటే అతనికి పిచ్చెక్కి పోయేది. తనకీ, తన బిడ్డకీ మోసం జరిగి పోయింది. అవమానం జరిగిపోయింది. కాని ఇప్పుడు ఏదో మార్గం ఆలోచించాలి. తన కూతుర్ని వెంటనే ఎవడికో ముడి పెడితే కాని ఈ లోకులు నోరు మూసుకోరు. తన కూతురు బతుక్కి ఒక నీడ ఏర్పడదు.

ఇంతలో త మ్ము ణ్ణుంచి ఉత్తరం వచ్చింది ఒక రెండో పెళ్ళతను శ్యామలను చేసుకోవడానికి ఇష్టపడుతున్నట్లు. వయస్సు యాభై వరకూ ఉంటాయంట.

★

**తాను నిజంగా ప్రేమిస్తున్న స్త్రీని ఏ పురుషుడూ పొగడతు; పొగడకూడదు.**

**—టకర్‌మన్**

**అవివేకులు అవివేకులతో తొందరగా కలిసిపోయి స్నేహాల చేస్తారు... వివేకవంతునికి స్నేహితులు తక్కువగా ఉంటారు.**

**— షేన్‌స్టన్**

★

అందుకు రాఘవరావు ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

తాను కమలను పెళ్ళాడుత సుమారు యాభయ్యో పడిలోనే.

''కమలా! ఇదిగో నేను మా తమ్ముడికి రాసిన ఉత్తరం. ఈ సంబంధం ఖాయం చేయమని నువ్వుకూడా శ్యామలకి రాయి ఈ సంబంధానికి తానెట్టి అభ్యంతరమూ చెప్పడానికి వీల్లేదని'' అంటూ ఒక ఉత్తరం ఇచ్చాడు.

''ఇదేనా మీ నిర్ణయం?'' భర్తని గుచ్చి గుచ్చి అడిగింది.

''వయస్సులో ఏముంది లెద్దూ ఈ వయస్సులో మనిద్దరం సంసారం చేసుకోవడం లేదూ?'' అనేసి గబగబా వెళ్ళిపోయాడు. తన కంటే ఇరవై రెండు సంవత్సరాలు చిన్నదైన కమల ముఖం లోకి చూసే ధైర్యం లేక.

ఆమె పెదాల మాద నిర్వచించ లేని నవ్వు మెదిలింది.

చాలా సేపు ఆలోచించింది శ్యామల గురించి. శ్యామల తనకో స్నేహితురాలు. బిడ్డ.

తల్లిగా తన బిడ్డ సుఖ సంతోషాలు చూడడం తన కర్తవ్యం, తన బాధ్యత.

ఆమె బంగారు బతుకు అలా నాశనం కావలసిందేనా?

ఒక నిట్టూర్పు విడిచింది.

శ్యామలకు ప్రత్యేకించి ఒక ఉత్తరం రాసింది.

తరవాత తన తమ్ముని దగ్గర నుంచి రాఘవరావుకి నెల తరవాత ఉత్తరం వచ్చింది.

అందులో 'శ్యామల ఒక కులం తక్కువ వాడితో లేచిపోయింది' అని వుంది.

దాంతో రాఘవరావు కూతురిని అసహ్యించుకున్నాడు. ఆమె మీద కక్ష కట్టాడు. ఆమెను తన జన్మలో చూడకూడదని నిర్ణయించుకున్నాడు.

అసలామె తన కడుపున పుట్టలేదే అనుకున్నాడు.

కాని. . .కాని. . .కాని

తన భార్య తనని మోసగించి ఇక్కడికి వచ్చిందంటే కారణం?

''చెప్పు—ఇక్కడి కెందు కొచ్చావ్?'' మళ్ళీ గర్జించాడు.

''ఇది నా కూతురిల్లు కనక''

''నీ కూతురా?—నువ్వు కన్నావా?''

''లేదు. నేను సవతి తల్లినే కావచ్చు. కాని తల్లి కూతుళ్ళ అనుబంధం ఉంది. అంతకంటే ముఖ్యమైనది, తోటి స్త్రీ పాలిట నేను చూపాల్సిన సానుభూతి, కర్తవ్యమూ కూడా ఉంది.''

''నోర్మూయ్—నేను నిర్ణయించిన సంబంధాన్ని కాదని ఇంట్లోంచి లేచి వచ్చిన దానికా నీ సానుభూతి?''

''హు మీరు నిర్ణయించిన సంబంధం! ఒక ముసలివాడికి ముడి పెట్టి ఆమె సచ్చటి బతుకు నాశనం చెయ్యాలనుకోవడం తండ్రి చెయ్యాల్సిన పని కాదు.''

''కమలా! నువ్వు మాత్రం నన్ను పెళ్ళాడ లేదూ?''

''అవును పెళ్ళాడాను. కట్నం ఇచ్చి నన్ను పెళ్ళి చెయ్యలేని మా నాన్న దీనావస్థ చూసి—నాకు నచ్చినెవరితోనైనా లేచిపోతే మిగిలున్న నా చెల్లెళ్లకు వివాహం కాకుండా పోతుందని—నా జీవితంలో అనుభవించాల్సిన సుఖాల్ని త్యాగం చేసుకుని బతుకుతున్నాను.''

అంతకాలంగా అణుకువగా పడున్న కమల అలా మాట్లాడుతుందను కోలేదు. అతనిలో రోషం, దాంతో పాటు వణుకూ పుట్టుకొచ్చింది.

''కమలా! నువ్వేనా మాట్లాడుతుంట?''

''అవును నేనే'' ఆమెలో అంతులేని ఉద్వేగం.

రాఘవరావు కొంతసేపు నిర్విణ్ణుడై పోయాడు.

ముచ్చెమటలు పోశాయి.

కడకు తేరుకుని ఒక నిట్టూర్పు విడిచాడు.

''అయితే ఇది లేచి పోవడానికి ఇదంతా నీ ప్రోత్సాహమన్నమాట.''

''అవును. నా జీవితంలా నా కూతురు జీవితం నాశనం కాకుడదనుకోవడంలో తప్పు లేదు. అందుకే ఈ సమస్యకు సమాధి కట్టాను. ఇది పొరపాటంటారా?''

సమాధానం చెప్పలేక రాఘవరావు తల దించుకున్నాడు. ★